# ప్రజాశక్తి

గురువారం 16 మార్చి 2023

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

## నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ తీర్పు



● కౌంటింగ్ జరిగే స్వర్ణభారతి స్టేడియం

- ◆ మండలి ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ◆ ఇనీషియల్ కౌంటింగ్‌కు 8 గంటలు
- ◆ తొలి ఫలితానికి ఒక రోజు సమయం
- ◆28 టేబుళ్లపై లెక్కింపు
- ◆500 పైచిలుకు కౌంటింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

**ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి తీర్పు వెలువడే సమయం వచ్చేసింది. ఈ నెల 13న జరిగిన పోలింగ్ ఫలితాల కోసం కౌంటింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఓటరు తీర్పు ఎలా ఉంటుందన్న ఉత్కంఠ ఉత్తరాంధ్ర అంతటా నెలకొంది.**

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లన్నింటినీ విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ చూస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు 2 లక్షలా 926 ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 28 టేబుళ్లను స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఒక రౌండ్‌కి 1000 ఓట్ల ఫలితాన్ని సిబ్బంది లెక్కిస్తారు. ఇనీషియల్ (ప్రారంభ) కౌంటింగ్ అయ్యేసరికి 8 గంటల సమయం పడుతుంది. తొలి ఫలితంతో దాదాపు ఒక అంచనాకు రావొచ్చు. పూర్తిగా ఫలితం రాబట్టేందుకు ఒక రోజు వ్యవధి పడుతుందని అధికారులు చెబుతున్నారు.

### విజేత నిర్ణయం ఎలా ?

పోలైన ఓట్లలో సగం కంటే ఒక్క ఓటు అధికంగా ఒక అభ్యర్థికి వస్తే వారిని విజేతగా రిటర్నింగ్ అధికారి ప్రకటించవొచ్చు. 8 రౌండ్ల ఇనీషియల్ కౌంటింగ్ తర్వాత ఆపై ఎన్ని రౌండ్లు ఎలిమినేషన్ ఉంటుందో చెప్పలేని పరిస్థితి. 37 మంది అభ్యర్థులు ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలో ఉండగా ప్రధాన పోటీ పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నాలుగో స్థానంలో బిజెపి ఉంటుంది. రౌండ్ల వారీగా ఎన్ని ఓట్లు ఏ అభ్యర్థికి వస్తాయన్నదానిపైనా విజయం ఆధారపడి ఉంటుంది. ప్రాధాన్యతా క్రమంలో ఓటరు అభ్యర్థికి ఓటు వేసే అవకాశం ఉండడంతో ఆ ఓట్ల లెక్కింపు వల్ల సమయం ఎక్కువ పడుతుంది. ఈ ప్రాధాన్యతా క్రమంలో చివర ఉన్న అభ్యర్థులు ఎలిమినేషన్ అవుతూ ఉంటారు. రెండో ప్రాధాన్యతా ఓటుపైనే విజయం ఈ ఎన్నికల్లో ఆధారపడి ఉంటుందన్నది పలువురి నోట మిగతా 2లో..



డాక్టర్ విఎస్.కృష్ణా కాలేజీ వద్ద తమ హాల్ టిక్కెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

## ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

**- 97.56 శాతం మంది హాజరు - తొలిరోజు ఏడుగురు డిబార్**

**ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 58,768 మంది విద్యార్థులకుగాను 57,333 మంది హాజరయ్యారు. 1435 మంది గైర్హాజరయ్యారు. సీలేరులో ఒకరు, చింతపల్లిలో ఆరుగురు డిబారయ్యారు. 97.56 శాతం హాజరు నమోదైంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా వెనక్కు పంపే నిబంధన ఉండటంతో విద్యార్థులు పరీక్షలకు పరుగులు తీయడం పలుచోట్ల కనిపించింది.**

వార్తలు లోపలి పేజీల్లో..

## నేటి నుంచి పారిశ్రామిక, ఇంజినీరింగ్ ఎక్స్‌పో

▶ వార్త 4లో..

## ఉత్పత్తి పేరుతో వేధింపులు తగవు

▶ వార్త 4లో..

## 'ప్రజా స్పందన' సిఎస్.రావు మృతి

▶ వార్త మెయిన్‌లో..




దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

## ఉక్కు పరిరక్షణకు విస్తృత పోరాటం

711వ రోజుకు జెఎసి దీక్షలు

వార్త 4లో..

## సిపిఎస్ రద్దుకు 26న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న విశాఖ డాబా గార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్లు నిర్ణయించాయి. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన మీడియా సమావేశంలో ఎపి ఎన్‌జివోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.శివారెడ్డి, డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు, ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ మాట్లాడుతూ 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, కొత్త పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యూనియన్ల నేతలు

తీసుకొచ్చిందన్నారు. చిన్న రాష్ట్రాలు దీనికి భిన్నంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు మొగ్గు చూపుతున్నాయని తెలిపారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒపిఎస్‌ను తేలేదు కానీ కొత్తగా జిపిఎస్‌ను తీసుకొచ్చి దుర్మార్గమైన పద్ధతికి శ్రీకారం చుట్టారన్నారు. 30 ఏళ్ల పాటు సేవ చేసి పొందుతున్న పెన్షన్‌ను రద్దు చేయడం, కేవలం ఐదేళ్లపాటు రాజకీయ జీవితం సాగించే ప్రజాప్రతినిధులకు మాత్రం జీవితాంతం పెన్షన్ ఇవ్వడం శోచనీయమన్నారు. ముందు వారికి సిపిఎస్ అమలు చేయాలని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



కౌంటింగ్ ఏర్పాట్లులో నిమగ్నమైన అధికారులు

## నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ తీర్పు

వినిపిస్తోంది. ఉత్తరాంధ్రలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యతా ఓటుతో గెలుపొందిన వారెవరూ 2007 నుంచి ఇప్పటివరకూ లేరు. ఈ దఫా కూడా ఇదే ఫార్ములా ఉంటుందన్నది భావిస్తున్నారు. అందుకే రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుంది.

### పిడిఎఫ్ గెలుపుపై అంచనా

శాసన మండలి ఎన్నికల ఫలితాలు, విజయావకాశాలపై ఇప్పటికే ఉత్తరాంధ్ర అంతటా చర్చోపచర్చలు జోరుగా సాగుతున్నాయి. ప్రచారంలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ముందున్నారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు, సిబ్బంది నివేదికలు, ఓటర్ల మాటలను పరిశీలిస్తే రమాప్రభ ప్రభంజనమే సర్వత్రా ఉంటుందని పలువురు చెబుతున్నారు. టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగుల విషయంలో రాష్ట్రంలోని అధికార వైసిపి సర్కారు నిర్బంధ వైఖరితో ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు పడిందన్నది పై నివేదికల సారాంశం. తెలుగుదేశం, బిజెపిలకు వారివారి పార్టీలకు చెందినవారి ఓట్లు పడినప్పటికీ పిడిఎఫ్‌కు వారు రెండో ప్రాధాన్యత ఓటు వేసినట్టు తెలుస్తోంది.

### ఏర్పాట్లు పరిశీలన

**ఎంవిపి.కాలనీ :** స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందికి విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ మాక్ కౌంటింగ్ నిర్వహించారు. అనంతరం వారు స్టేడియంలోని ఏర్పాట్లును పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

గురువారం ఉదయం నుంచే కౌంటింగ్ ప్రారంభమవుతున్నందున స్టేడియం పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కౌంటింగ్ సిబ్బంది వాహనాలను బుల్లయ్య కాలేజీ నార్త్ గేటు (రేసపువానిపాలెం) వద్ద వారికి కేటాయించిన పార్కింగ్ స్థలంలో నిలుపుదల చేయాలి. టూ వీలర్స్‌ను బుల్లయ్య కాలేజీ బాస్కెట్‌బాల్ గ్రౌండ్ వద్ద పార్కింగ్ చేసుకోవొచ్చు. స్వర్ణభారతి జంక్షన్ వద్ద రద్దీ దృష్ట్యా బుల్లయ్య కాలేజీ జంక్షన్ నుంచి స్వర్ణభారతి జంక్షన్ వరకు సాధారణ వాహనాలను అనుమతించరు. వాహనదారులు రామాటాకీస్ జంక్షన్ గుండా ప్రయాణించాలి. మద్దిలపాలెం జంక్షన్ నుంచి రామాటాకీస్ జంక్షన్ వరకూ రద్దీ ఎక్కువుగా ఉండే అవకాశమున్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. ఇంటర్ పరీక్షలకు వచ్చేవారు సత్యం జంక్షన్ గుండా వచ్చి బుల్లయ్య కాలేజీ మెయిన్ గేటుకు చేరుకోవాలి. స్వర్ణభారతి స్టేడియం చుట్టుపక్కల ఎటువంటి వాహనాలనూ నిలుపరాదు. రామాటాకీస్ నుంచి మద్దిలపాలెంవైపు, మద్దిలపాలెం నుంచి రామా టాకీస్ వైపు వెళ్లవలసిన వాహనదారులు సత్యం జంక్షన్ మీదుగా వెళ్లాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## సిపిఎస్ రద్దుకు 26న రాష్ట్ర సదస్సు

డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పెన్షన్ ఉద్యోగుల, కార్మికుల జన్మ హక్కు అని, వారి కుటుంబాలకు భద్రత అవసరమని పేర్కొందని గుర్తు చేశారు. కరోనా సమయంలో మరణించిన ఉద్యోగుల వారసులకు తక్షణం ఉద్యోగాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సవరణను అమలు చేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును ఇవ్వడానికి కూడా ప్రభుత్వాలు సహకరించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిఎ బకాయిలను చెల్లించాలన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, రైల్వే ప్రైవేటీకరణను ఆపాలన్నారు. 26న జరిగే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

## 'క్రెడిట్ కార్డుతో ఫ్లిప్‌కార్ట్ ప్రయోజనాలు'

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** హెచ్‌డిఎఫ్‌సి, ఫ్లిప్‌కార్ట్ గ్రూపు విస్తృతమైన ఆన్ లైన్, ఆఫ్ లైన్ ఉనికి కలిగి ఉన్న ఓమ్ని ఛానల్ బి టు బి ఇండస్ట్రీ ఫస్ట్ కో - బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ సేవలను ప్రారంభించాయని ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్ బిజినెస్ హెడ్ కోటేశ్వర్ ఎల్ఎన్ తెలిపారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్డు హోల్‌సేల్ సభ్యులకు మాత్రమే పరిమితమైందన్నారు. డైనర్స్ క్లబ్ కార్డులు ప్రపంచ వ్యాప్తంగా 200 కంటే ఎక్కువ దేశాలలో ఉపయోగించుకోవచ్చునన్నారు. ఫ్లిప్‌కార్ట్ హోల్ సేల్ ఆన్‌లైన్ ఖర్చులపై ఐదు శాతం క్యాష్ బ్యాక్‌ను ఇండస్ట్రీ ఫస్ట్ ఆఫర్‌గా పొందవచ్చన్నారు.

ఆర్‌టిసి సిబ్బందిపై

# దాడులకు పాల్పడ్డవారిని శిక్షించాలి

**ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ :** విధి నిర్వహణలో ఉన్న ఆర్‌టిసి సిబ్బందిపై కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచిన వారిని కఠినంగా శిక్షించాలని ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి ఎ.సీతాలక్ష్మి, అధ్యక్షులు పి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ రూరల్ డిపో ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపోకు సమీపంలోనే విధులకు హాజరవుతున్న సిబ్బందిపై ఇటువంటి దాడులు జరగడం దారుణమన్నారు. డిపోకు ఎదురుగా ఉన్న బస్ స్టాప్ కొంతకాలంగా నిరుపయోగంగా ఉందని, అక్కడకు చేరిన కొంతమంది ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలతో సిబ్బందిలో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుందని పేర్కొన్నారు. సిబ్బంది బాగోగులు చూడవలసిన డిపో యాజమాన్యం ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. దీనివల్ల సిబ్బందిలో భయాందోళలు పెరిగి, డిపో ఆదాయంపై దాని ప్రభావం పడుతుందన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కెఆర్.కుమార్ మాట్లాడుతూ ఆర్‌టిసి సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎసి.ప్రసాద్, వర్మ, బి.స్వామి, కరీముల్లా, ఎంకె.రావు, వాసు, దేవుడు, ఎస్.రామారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

## సిఎస్.రావు మృతికి సంతాపం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విద్యాభిమాని, ప్రజాపక్షపాతి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి సిఎస్.రావు మృతి పట్ల ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఒ) ఓ ప్రకటనలో సంతాపం తెలిపింది. ఈ మేరకు సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అభిలాష్, బి.సంతోష్ ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎస్.రావు రిటైర్డ్ అయిన ఇతర ప్రభుత్వ అధికారుల మాదిరిగా ఖాళీగా ఉండకుండా విశాఖపట్నంలో విద్యార్థుల, మహిళల, పేద ప్రజల సమస్యలపై పోరాటం చేపట్టారని గుర్తు చేశారు.

## మసీదు స్వాధీనం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** చిన వాల్తేరులోని మహమ్మదీయ మసీదును విశాఖ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గతంలో కొంతమంది వ్యక్తులు మసీదును స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా హైకోర్టు ఆదేశాలతో వక్ఫ్‌బోర్డు అధికారులు మసీదును స్వాధీనం చేసుకున్నారు.

## రైల్వే లైన్ల తనిఖీ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ బుధవారం కోరాపుట్ - కొత్తవలస రైల్వే లైన్లను తనిఖీ చేశారు. ట్రాక్, వంపులు, వంతెనలు, పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. కోరాపుట్ -కొత్తవలస సెక్షన్‌లో కొనసాగుతున్న డబుల్ లైన్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోరాపుట్ స్టేషన్‌లోని రన్నింగ్ రూమ్, రెస్ట్ హౌస్‌లను పరిశీలించారు. రన్నింగ్ రూమ్‌లోని లోకో పైలట్లు, మేనేజర్లతో సంభాషించారు. రైల్వే స్టేషన్‌లోని వ్యాపారులతోనూ మాట్లాడారు. అనంతరం చిమిడిపల్లి సమీపంలోని సొరంగాలను పరిశీలించారు. ఆయన వెంట వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి, తదితరులు ఉన్నారు.

## బాలుడు అదృశ్యం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** మహరాణిపేటకు చెందిన మద్దాల జ్ఞాన సాయి వర్మ ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ తల్లి మద్దాల రోజా మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కెడిపిఎం స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న జ్ఞాన సాయి వర్మ ఎప్పటిలాగే స్కూలుకు వెళ్లాడని తెలిపింది. నేటికీ తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొంది.

## పోలీసులా.. వైసిపి కార్యకర్తలా..

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** రాష్ట్రంలోని పోలీసులు వైసిపి కార్యకర్తల్లా మారిపోయారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు విమర్శించారు. బుధవారం ఉదయం లాసన్స్ బే కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీలో ప్రథమ స్థానం సాధించానని చెప్పుకునే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎక్కడ ఓటు వేశారో చెప్పాలన్నారు. అసలు ఓటు నమోదు చేసుకున్నారా ? లేదా ? అన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. డిఎల్‌బి స్కూల్ వద్ద ఎన్నికల రోజున ఎఎస్‌ఐ సతీష్ కుమార్ టిడిపి 46వ వార్డు అధ్యక్షుడు పైడికొండ పసుపు షర్టు వేసుకున్న కారణంగా షర్టు విప్పించారని, అదే రోజున కలెక్టర్ కూడా లైట్ ఎల్లో కలర్ షర్ట్ వేసుకున్నారని, ఆయన్ని ఎందుకు వదిలేశారని ప్రశ్నించారు.

విনియోగ రుసుం పేరుతో..

# ప్రజలపై ఆర్థిక భారం

▶▶ చెత్త పన్ను వసూలుతోనే క్లాప్ వాహనాల నిర్వహణ

▶▶ ఫిబ్రవరిలో రూ.10 లక్షలు వసూలు



ప్రజాశక్తి -భీమునిపట్నం : చెత్త పన్ను విధింపుతో పట్టణ ప్రజలపై ఆర్థిక పరమైన భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపాయి. వినియోగదారుల రుసుము వసూలు పేరుతో జివిఎంసి పారిశుధ్య విభాగం వార్డు సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది నెల వారీ ఒక్కో ఇంటి నుంచి రూ.60 వసూలు చేస్తున్నారు. అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారిలో ఒక్కో ఇంటి నుంచి నెలకు రూ.120 వసూలు చేస్తున్నారు. చెత్త పన్ను ఇవ్వాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారని కొంత మంది గృహ యజమానులు చెబుతున్నారు. చెత్త సేకరిస్తున్న న్నందుకు, పన్ను చెల్లించడం మీ బాధ్యత అంటూ జివిఎంసి అధికారులు ఓ వింత వాదనను ప్రజల ముందుకు తెస్తున్నారు. ఒక్కోసారి కొన్ని సందర్భాల్లో చెత్త పన్ను వసూళ్లకు వార్డు వాలంటీర్లపై సైతం ఒత్తిడి తెస్తున్న సందర్భాలు లేకపోలేదు. ఏది ఏమైనా ప్రజలపై ఆర్థిక పరమైన భారం మోపడం సరి కాదని ఇప్పటికే పలువురు స్పష్టం చేస్తున్నారు.

**ఆస్తిపన్నులోనే చెత్త పన్ను ఇమిడి ఉంది**

ఆస్తిపన్ను (ఇంటి పన్ను) విధింపులోనే పారిశుధ్య నిర్వహణ రుసుము అనేది ఏనాటి నుంచో ఇమిడి ఉన్నట్లు గతంలో పొందుపర్చిన చట్టంలోనే ఉందని పలువురు పదేపదే రాష్ట్ర ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**ముక్కుపిండి వసూలు!**

2021 నవంబర్ నుంచి చెత్త పన్నును ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. జివిఎంసి ఒకటో జోన్ పరిధి 4 వార్డుల్లో 2023 జనవరి నెలలో 50 శాతం చెత్త పన్ను వసూలైంది. ఫిబ్రవరిలో రూ.17 లక్షలా 36 వేలా 740 డిమాండ్ కాగా, 60.25 శాతం అంటే రూ.10 లక్షలా 46 వేలా 300 వసూలైంది.

**క్లాప్ వాహనం నిర్వహణకు నెల వారీ రూ.60 వేలు**

ప్రతి ఉదయం చెత్త సేకరణకు ఇంటి ముంగిటకు వచ్చే క్లాప్ వాహనం నిర్వహణకు ప్రజల నుంచి వసూలు చేస్తున్న చెత్త పన్ను మొత్తం నుంచి రూ.60 వేలు ఇవ్వాల్సి ఉంది. ఈ మొత్తం నుంచే సంబంధిత డ్రైవర్ వేతనం, వాహనానికి అవసరమయ్యే డీజిల్ తదితరాలకు ఖర్చవుతుంది. ఈ విధంగా ప్రజలపై భారం మోపి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టుగా ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం ఏ మాత్రం సమర్థనీయం కాదని పలువురు విమర్శిస్తున్నారు.

**రోజు వారీ 30టన్నుల చెత్త సేకరణ**


ఒక్కో క్లాప్ వాహనం ద్వారా తడి, పొడి, ప్రమాదకర చెత్త ను రోజుకు 1000 నుంచి 1420 కిలోలను పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. 4 వార్డుల్లో 21 క్లాప్ వాహనాలు, 3 ట్రాక్టర్లు ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి ద్వారా రోజుకు సుమారు 30 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది.

**పారిశుధ్య కార్మికుల నియామక ఊసే లేదు**

పట్టణ జనాభాకు, అవసరాలకు సరిపడా పారిశుధ్య కార్మికుల నియామకం ఊసే లేదని చెప్పాలి. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు కేవలం 26 మంది మాత్రమే ఉన్నారు. ముగ్గురు మెస్త్రీలు ఉన్నారు. 130 మంది పారిశుధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. తక్కువ మంది కార్మికులతో ఎక్కువ పని చేయిస్తుండడంతో వీరిపై పని భారం పడుతోంది.

**నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే...**

సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, 2016 నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకే చెత్త సేకరణకు వినియోగ దారుల నుంచి రుసుం (యూజర్ చార్జీలు) వసూలు చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను విధించినట్లుగా కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. కాశ్మీరు నుంచి కన్యా కుమారి వరకు చెత్త సేకరణకు ప్రజల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు.



**బొడ్డేపల్లి రాము**
**జోన్-1 కమిషనర్**



గీతంలో మాట్లాడుతున్న న్యూహ్యాంప్‌షైర్ వర్సిటీ ప్రతినిధులు

## గీతంలో న్యూ హ్యాంప్‌షైర్ వర్సిటీ బృందం

ప్రజాశక్తి-మధురవాడ : అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ హ్యాంప్‌షైర్ అకడమిక్ నిపుణుల బృందం బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాయాన్ని సందర్శించింది. న్యూ హ్యాంప్‌షైర్ డీన్ మైక్ డిసెల్లే, గ్రాడ్యుయేట్ స్కూల్ డీన్ డాక్టర్ కేరీమూర్‌హెడ్, ఇంజినీరింగ్ విభాగం చైర్మన్ క్రిస్టోఫర్ లెబ్‌ల్యాంక్, అడ్మిషన్ల విభాగం సహయ డైరక్టర్ మేడిసన్ ఫెరేరి గీతం ఇంజినీరింగ్ విభాగం సీనియర్ ప్రొఫెసర్లు, డీన్‌తో సమావేశమై బోధన, పరిశోధన అంశాలపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో న్యూ హ్యాంప్‌షైర్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న కోర్సులను, పరిశోధన అవకాశాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తిచేశారు. కార్యక్రమానికి గీతం అదర్ కెరీర్ ఆప్షన్స్ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికాంత్ సంధానకర్తగా వ్యవహరించారు.




విద్యార్థి ఈశ్వర్‌వర్ధన్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

## 'సాయి గణపతి' విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గిడిజాల సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి ఈశ్వర్‌వర్ధన్ 100 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఆల్ ఇండియా సౌత్ జోన్ పాలిటెక్నిక్ కళాశాల స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థి పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఈశ్వర్‌వర్ధన్‌ను కళాశాల డైరెక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు ,ఫిజికల్ డైరెక్టర్ వెంకట్ రాజు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకంపై హర్షం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి కాపలాదారుల నియామకంపై రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడంపై బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి కాపలాదారులు లేకపోవడంతో పాఠశాలల్లో దొంగతనాలు, రాత్రి సమయంలో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

## ఎన్‌ఎస్‌ఎస్‌తో యువతలో సేవాభావం

ప్రజాశక్తి-మధురవాడ : జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా యువతలో సేవా భావం పెరుగుతోందని, సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం పేర్కొన్నారు. గీతం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. రక్తం అందించడం ద్వారా అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి ప్రాణాలు నిలుస్తాయన్నారు. ప్రస్తుత అవసరాలను గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరంలోని వివిధ బ్లడ్ బ్యాంక్‌ల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు గీతంలో వరుసగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌విజి రెడ్డి, ప్రొఫెసర్ పివివై. జయశ్రీ, ప్రొఫెసర్ తమ్మిరెడ్డి, మదర్ రక్త నిధి కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

## గీతం వర్సిటీకి డిఎస్‌టి పరిశోధన ప్రాజెక్టు

ప్రజాశక్తి-మధురవాడ : స్థానిక పరిశ్రమలకు విద్యాలయాలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, నిరంతర శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో విద్యాలయాలను అనుసంధానం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సాంకేతిక విజ్ఞాన కేంద్రం (జి-టెక్) ఏర్పాటుకు భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) రూ.3.28 కోట్ల భారీ ప్రాజెక్టును మంజూరు చేసిందని గీతం రీసెర్చ్ అండ్ డెవలప్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా గీతంలో ఏర్పాటవుతున్న జి-టెక్ విజ్ఞాన కేంద్రం త్వరలో తన కార్యకలాపాలను ప్రారంభించనుందని వెల్లడించారు. జి-టెక్ కార్యక్రమాలు గీతంతో పాటు రాష్ట్రంలోని సహ విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసే విధంగా ఉంటాయని తెలిపారు. వివిధ విద్యా సంస్థలలోని పరిశోధకుల నూతన ఆవిష్కరణలను గుర్తించడం, వాటికి మార్కెటింగ్ అవకాశాలను తెలియజేయడంతో పాటు స్థానిక పరిశ్రమల సాంకేతిక అవసరాలను తెలుసుకుని వాటికి అవసరమైన నూతన పరిజ్ఞానాన్ని ప్రయోగశాలలో అభివృద్ధి చేయడంపై జి-టెక్ దృష్టి సారిస్తుందని చెప్పారు. పరిశోధకుల మధ్య బలమైన సంబంధాలను నెలకొల్పడానికి సదస్సులు, వర్క్‌షాప్‌లు, చర్చా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి త్వరలో పరిశ్రమల నిపుణులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మక ప్రాజెక్టును గీతం డీమ్డ్‌విశ్వవిద్యాలయానికి అప్పగించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర కారాగారంలో ముగిసిన సదస్సు




సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ అడ్మిరల్ టి.సుధాకర్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో 'స్టేక్ హోల్డర్స్ కో-ఆర్డినేషన్ అండ్ లీడర్ షిప్' అంశంపై జైళ్ళశాఖ అధికారులకు మూడు రోజుల పాటు నిర్వహించిన సదస్సు బుధవారంతో ముగిసింది. ముగింపు సదస్సుకు ఇండియన్ నేవీ రిటైర్డ్ అడ్మిరల్ టి.సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టాన్ని ఉల్లంఘించిన నేరస్తులు ఉన్న జైళ్ళశాఖలో ఉద్యోగం చేయడం సాధారణ విషయం కాదన్నారు. దానికి ఎంతో నైపుణ్యం ఉండాలన్నారు. జైల్లో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగీ ఒక లీడర్ అన్నారు. నేరస్తులను క్రమ శిక్షణలో పెట్టి వారిలో మార్పు తీసుకు రావడానికి నిరంతరం కృషి చేస్తూ తద్వారా సమాజానికి ఎంతో సేవ చేస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం జైళ్ళ శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు, ముఖ్యఅతిథి టి.సుధాకర్‌తో కలిసి సదస్సులో పాల్గొన్న అధికారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్రకారాగరాం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# సుందరంగా రహదారులు



ముడసర్లోవ వెనుక భాగంలో అందంగా తయారుచేసిన రహదారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖలో ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న జి-20 సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే నగరంలో పలు ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విదేశీ ప్రముఖులు ముడసర్లోవ రిజర్వాయర్‌లో నెలకొల్పిన ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను సందర్శించనుండటంతో ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక భాగంలో గల రహదారులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే ఈ రహదారులకిరువైపులా చెత్తా చెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించారు. ముడసర్లోవ భూముల రక్షణ గోడలకు రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విదేశ ప్రముఖులు సందర్శిస్తున్న ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ పరిసరాల్లో రహదారులు, మొక్కలు, టాయిలెట్స్, బ్రిడ్జ్‌కు రంగులు అద్దుతున్నారు.

# ఉత్పత్తి పేరుతో వేధింపులు తగవు : సిఐటియు

**ప్రజాశక్తి -గాజువాక :** ఉత్పత్తి పేరుతో భెల్ హెచ్‌పివిపి కార్మికులను వేధించడం తగదని జిఎం.జితేందర్‌రెడ్డికి భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జెటిపి.ప్రకాష్, నాయకులు జగన్నాథరావు, నారపరెడ్డి, విజయ్‌కుమార్ మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. యాజమాన్యం రూ.350కోట్ల ఉత్పత్తి లక్ష్యసాధనకు సహకరించాలని విజ్ఞప్తి చేసిందని, ఈ పిలుపుతో కార్మికులు పూర్తి శక్తిసామర్థ్యాలతో పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులు ఉత్పత్తిప్రక్రియలో నిమగ్నమై ఉన్నప్పుడే యాజమాన్యం రెండు పంచింగుల విధానం అమలు చేసిందని పేర్కొన్నారు. ఓవర్ టైం చెల్లించకున్నా సిఆఫ్ చేయిస్తున్నా ఉత్పత్తి అందరి బాధ్యతగా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సమయంలోనే భెల్ మరే ఇతర యూనిట్లలో లేని విధంగా వ్యక్తిగత అనుమతులు నెలాఖరువరకు రద్దుచేయడం దారుణమన్నారు. ఇన్సెంటివ్ చెల్లించడం లేదని, ఎస్‌ఐపిపిపి లేకుండా పోయాయని, టౌన్‌షిప్ స్కూలు ఫీజులు ఆకాశంలో ఉన్నాయని, 2008-2023 మధ్య 600 మందికి పైగా ఉద్యోగ విరమణ పొందడంతో ఉన్నవారిపై పనిభారం పెరిగిపోతుందని వివరించారు. అధికారులు ఎక్కువగా, కార్మికులు అరకొరగా బదిలీపై వచ్చారని తెలిపారు. వ్యక్తిగత భద్రతా పరికరాలు లేకపోయినా, యంత్రాలకు సరైన గార్డులు లేకున్నా, కార్మికులకు యూనిఫామ్ సకాలంలో ఇవ్వకపోయినా, వెల్డర్లకు యాంకిల్ బూట్లు లేకున్నా, పనిచేసే మోపులు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ, క్రేనులకు లిమిట్లు సరిగా పనిచేయకున్నా, ఆవిర్లు, పొగలు పోవడానికి ఎక్సహాస్ట్ తగినన్ని లేకున్నా, వర్షం పడితే తీవ్రంగా కారిపోయే పైకప్పు, నీటికుంటల్లా షాపులున్నా, రెండుమూడు షాపులకు ఒకేచోట టాయిలెట్లున్నా, 60 -70 మందికి ఒకేఒక చిన్నకుళాయి సౌకర్యం ఉన్నా, ఆర్‌ఒ తాగునీరు మూన్నాళ్ళ ముచ్చటే అయినా, పందులు, పశువులు బెడద తీవ్రంగా ఉన్నా, రిఫరల్ ఆసుపత్రుల్లో కూడా డబ్బుచెల్లిస్తేనే ట్రీట్‌మెంట్ ఉన్నా, అసౌకర్యాల నిలయంగా క్వార్టర్స్ ఉన్నా, పని విషయంలో కార్మికుల చిత్తశుద్ధి ఏమాత్రం చలించలేదని పేర్కొన్నారు. అటువంటి కార్మికులపై వేధింపులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు.

## లయన్స్ కేన్సర్ హాస్పిటల్‌కు రూ.25 లక్షల విరాళం

**ప్రజాశక్తి-సీతమ్మధార:** సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్, జనరల్ ఆసుపత్రికి లారస్ ల్యాబ్ రూ.25 లక్షల విరాళాన్ని అందించింది. లారస్ చారిటబుల్ ట్రస్ట్ సిఎస్ఆర్ కార్యకలాపాల క్రింద ఈ మొత్తాన్ని లారస్ ల్యాబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చావ సత్యనారాయణ హైదరాబాద్‌లో అందించారు. వైద్య పరికరాలు కొనుగోలు, ఇతర అభివృద్ధి కార్యకలాపాలు, రోగులకు సహాయం నిమిత్తం ఈ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా లారస్ చారిటబుల్ ట్రస్టుకు లయన్స్ కేన్సర్, జనరల్ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ వి.ఉమామహేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తామని చెప్పారు.

## పౌర గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** పౌర గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులకు, ఉద్యోగార్థులకు వివిధ అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా గ్రంథాలయం సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు వ్యవహరించారు. 60 మంది విద్యార్థులు 8 బృందాలుగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పారిశ్రామిక, ఇంజినీరింగ్ ఎక్స్‌పో




**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** ఇండోర్ ఇన్ఫో లైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన బీచ్ రోడ్‌లోని గాదిరాజు ప్యాలెస్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు పారిశ్రామిక, ఇంజినీరింగ్ ఎక్స్ పో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఎకె అగర్వాల్ తెలిపారు. బుధవారం విజెఎఫ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 16న ఉదయం ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ఎక్స్ ఫోను వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఆపరేషన్ డైరెక్టర్ బి.అరుణ్‌కాంతి, ఎంఎస్ఎంఇ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో పాల్గొన్న వారికి మార్గదర్శకాల ప్రకారం 100 శాతం సబ్సిడీ కల్పిస్తారని చెప్పారు. దేశం నలుమూలలు నుంచి సుమారు 10 వేల మంది సందర్శకులు హాజరవుతారని భావిస్తున్నామన్నారు. విశాఖలో ఎంఎస్ఎంఇ రంగంలో విస్తరణకు గొప్ప అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీపై దృష్టి సారించినట్లు వివరించారు. సౌరశక్తి ప్లాంట్లు, పైకప్పు ఇంధన ఉత్పత్తి యొక్క తాజా సమాచారాన్ని సందర్శకులు పొందవచ్చన్నారు.

వివిధ పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించిన 5 వేల యూనిట్లు ప్రదర్శించనున్నామని తెలిపారు. వీటి స్టాల విలువ రూ.40 కోట్లు పైబడి ఉంటుందన్నారు. పారిశ్రామిక ఆటోమేషన్, మెషిన్ టూల్స్, బేరింగ్లు, స్విచ్ గేర్లు, వెల్డింగ్ పరికరాలు, పవర్ టూల్స్, హ్యాండ్ టూల్స్, వంటి ఉత్పత్తులను, కట్టింగ్ టూల్స్, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ పరికరాలు, ప్రీ ఇంజినీరింగ్ మెటీరియల్స్, మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్రొడక్ట్స్, సేఫ్టీ ప్రొడక్ట్స్, మెయింటెనెన్స్ ప్రొడక్ట్స్, మరెన్నో రకాల ఉత్పత్తులను దేశంలోని హైదరాబాద్, ముంబాయి, బెంగళూరు, చెన్నై, న్యూఢిల్లీ, కోల్ కతా, నాగపూర్ వంటి నగరాల నుంచి వచ్చిన 100 మందికి పైగా ఎగ్జిబిటర్స్ ప్రదర్శిస్తున్నారని తెలిపారు. ఈ వేదికపైన సరఫరాదారులు, తయారీదారులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, స్టాకిస్టుల మధ్య బీటుబి సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఇది నగరంలో నూతన వ్యాపార అవకాశాలకు తెరతీస్తుందన్నారు. ఈ ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు.

## ప్లాంటేషన్ సకాలంలో పూర్తి చేయండి

**ప్రజాశక్తి-విశాఖపట్నం :** నగర సుందరీకరణ పనులలో భాగంగా ప్లాంటేషన్ పనులు సకాలంలో పూర్తిచేయాలని అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారులకు జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. జి-20 సదస్సుకు జరుగుతున్న సుందరీకరణ పనుల పరిశీలనలో భాగంగా బుధవారం ఆయన అప్పుఘర్ నుంచి చేపలుప్పాడ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న సుందరీకరణ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల పనులు, సెంట్రల్ మీడియాకు రంగులు వేసి పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. రోడ్ల సెంట్రల్ మీడియంలో ప్లాంటేషన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలని, బహిరంగ మలమూత్ర విసర్జన, వ్యర్థాలు వేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో బి.సురేష్‌కుమార్, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విస్తృత పోరాటం

**ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విస్తృత పోరాటం నిర్వహిస్తామని సిఐటియు విశాఖ జిల్లా నాయకులు వి.కృష్ణారావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 711వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ, 711 రోజులుగా స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ఉద్యమానికి ఏప్రిల్ 2వ తేదీకి రెండు సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ నుంచి వెనక్కు తగ్గేవరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టంచేశారు. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపికి ఉత్తరాంధ్ర ప్రజలు గట్టిబుద్ధి చెప్పబోతున్నారన్నారు. ఈ దీక్షా శిబిరంలో సిఐటియు నాయకులు పి.వెంకటరావు, అనపర్తి అప్పారావు, జి.నాయుడు, జివిఎన్ చలపతి, విజయ, పీతల అప్పారావు, ఎం.చంటి, రమణి, త్రినాధరావు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు జయంతి బ్రోచర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని సమైక్యభారతి, బీచ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎయులో వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు బీచ్ రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. అటువంటి మహనీయుని గౌరవించి జయంతి వేడుకలు నిర్వహించుకోవటం ప్రతి ఆంధ్రునికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల ఆహ్వానసంఘం అధ్యక్షులు డాక్టర్ బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.

### భారత్ -ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌లో..

# జియ్యాని శ్రీధర్‌కు స్వాగత బాధ్యతలు

**ప్రజాశక్తి -కరాస:** వైఎస్ఆర్ ఎసిఎ విడిసిఎ స్టేడియంలో ఈ నెల 19వ తేదీన భారత్ , ఆస్ట్రేలియ జట్ల మధ్య జరిగే వన్డే క్రికెట్ మ్యాచ్‌కి సంబంధించి నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు కీలక బాధ్యతలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అప్పగించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన సమావేశంలో క్రికెట్ మ్యాచ్ కోసం విశాఖ చేరుకునే ఇరు జట్ల క్రికెట్ ఆటగాళ్లకు విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికేందుకు శ్రీధర్‌ను నియమిస్తు జారీచేసిన ఉత్తర్వులను ఎసిఎ సెక్రటరీ గోపీనాథ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు. ఎసిఎ అధ్యక్షులు పి.శరత్‌చంద్రా రెడ్డికి, సెక్రటరీ గోపీనాథ్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీలు

**ప్రజాశక్తి -యంత్రాంగం**

క్షయ వ్యాధి నివారణపై నగరంలో బుధవారం పలుచోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

**భీమునిపట్నం :** స్థానిక సిహెచ్‌సి, పిహెచ్‌సి, యుపిహెచ్‌సి పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల వైద్యాధికారులు సిహెచ్.కనకదుర్గ, డి.సిద్ధార్థకుమార్, బి.మల్లికార్జునరావు, స్వప్న, అఖిల, సుస్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

**మధురవాడ :** జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నర్సింగ్ విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. టిబి ఓడి పోవాలి..., దేశం గెలవాలి..., చుట్ట, బీడీ, సిగరెట్టు టీబీ జబ్బుకు తొలి మెట్టు..., కళ్లె పరీక్ష చేసుకో క్షయని నిర్ధారించుకో..., టీబీ పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితం... అంటూ ర్యాలీలో నినదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దీపిక, సిహెచ్ఒ ఎస్.సౌభాగ్యమణి, హెచ్ఎస్ రమణ, ఎస్‌టిఎస్ సురేష్, ఎస్‌టిఎల్ఎస్ వీరబ్రహ్మం, టీబీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆనందపురం :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన బోయపాలెం, లొడగలవానిపాలెంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కోరాడ శైలజ మాట్లాడుతూ, దగ్గు ఎక్కువగా ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, బోయపాలెం స్కూల్ ప్రధానోపాధ్యాయులు వైవి.రావు, రమణ, సిహెచ్ఒ ఎన్.సాయి గౌతమి, ఎస్.సురేష్ కుమార్, అరుణ కుమార్, విద్యార్థులు, లోడగలవారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శాహనజ్, హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, సెక్రటరీ అనురాధ, సిహెచ్ఒ అరుణ, హెల్త్ అసిస్టెంట్ తారకేష్, ఆశా కార్యకర్తలు మంగ, పాపయమ్మ పాల్గొన్నారు.



మధురవాడలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఆరిలోవ :** జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆధ్వర్యాన ఆరిలోవలో ర్యాలీ నిర్వహించారు. ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు వద్ద గల రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు, మాట్లాడుతూ, క్షయ వ్యాధిపై క్షేత్రస్థాయిలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కళ్లె పరీక్ష, ఎక్సరే, సిబిఎన్ఎటి, ఆర్‌టిపిసిఆర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షయ రోగులకు ఉచితంగా మందులతో పాటు చికిత్స సమయంలో పోషకాహారం కోసం నెలకు రూ.500 ఆర్థికసాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిఒ డాక్టర్ పూర్ణేంద్రబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమన్ చంద్ర, యుపిహెచ్‌సి, ఆరిలోవ జివిఎంసి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-యస్.రాయవరం:** ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామ్ నాయక్, సూపర్వైజర్ అభిలాష్, ఆదినారాయణరావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ భవనానికి నష్టపరిహారం, అద్దె చెల్లించకపోవడంతో

# ఎఎస్‌డబ్ల్యుఒ కార్యాలయ జప్తుకు కోర్టు ఆదేశం

### హైకోర్టును ఆశ్రయించినట్లు తెలియజేయడంతో వెనుదిరిగిన కోర్టు అధికారులు

ప్రజాశక్తి- అనకాపల్లి

వసతి గృహం నిర్వహించిన భవనానికి నష్టపరిహారం, అద్దె చెల్లించకపోవడంతో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కార్యాలయాన్ని జప్తు చేయాలని అనకాపల్లి జిల్లా కోర్టు బుధవారం ఆదేశించింది. దీంతో కోర్టు అధికారులు జప్తు చేసేందుకు వెళ్లారు. హైకోర్టులో స్టే ఆర్డర్ కోసం దరఖాస్తు చేశామని, జప్తును నిలుపుదల చేయాలని సోషల్ వెల్ఫేర్ అధికారులు కోరడంతో కోర్టు అధికారులు వెనుదిరుగారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

మండలంలోని మార్టూరు గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఎస్సీ బాయ్స్ హాస్టల్ నిర్వహణకు ఆ గ్రామానికి చెందిన పప్పు సత్యనారాయణ ఇంటిని 1994లో అద్దెకు తీసుకున్నారు. కొంతకాలం తరువాత స్పెషల్ హాస్టల్ కోసం అదనపు గదులు కావాలని అధికారులు కోరడంతో ఇంటి యజమాని నిర్మించి ఇచ్చారు. 2005లో అకస్మాత్తుగా భవన యజమానికి తెలియకుండా హాస్టల్‌ను ఖాళీ చేసి వేరే భవనంలోకి మారారు. అప్పటికే పాత భవనంలోని ఫర్నిచర్, విద్యుత్తు వైరింగ్, ప్రహరీ, మోటారు ధ్వంసం కావడంతో నష్ట పరిహారం ఇవ్వాలని భవన యజమాని హాస్టల్ అధికారులను కోరారు. వారు పట్టించుకోకపోవడంతో 2006లో భవన యజమాని జిల్లా కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, వసతిగృహం వార్డెన్‌పై కోర్టులో కేసు వేశారు. దీనిపై కింద కోర్టు 2018లో తీర్పు ఇస్తూ రూ.4.20 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాన్ని సైతం సోషల్ వెల్ఫేర్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో భవన యజమాని జిల్లా కోర్టును ఆశ్రయించారు. అసలు, వడ్డీతో కలిపి సుమారు రూ.9.40 లక్షలు చెల్లించకపోవడంతో కోర్టు ఉల్లంఘన కింద పట్టణంలోని విజయరామరాజుపేటలో ఉన్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి కార్యాలయాన్ని జప్తు చేయాలని ఈ నెల 15న బుధవారం జిల్లా కోర్టు ఆదేశించింది. దీంతో కోర్టు అధికారులు జప్తు చేసేందుకు వెళ్లారు. దీనిపై స్టే కోసం హైకోర్టులో దరఖాస్తు చేస్తున్నందున జప్తు ఆపాలని కోరడంతో కోర్టు సిబ్బంది ఈ విషయాన్ని నివేదిక ద్వారా కోర్టుకు తెలియజేస్తామని చెప్పి వెనుతిరిగారు.


సోషల్ వెల్ఫేర్ అధికారులతో మాట్లాడుతున్న కోర్టు అధికారులు



ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పట్టణంలో కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని సత్యనారాయణ థియేటర్, నిదానం దొడ్డి, న్యాయస్థానాల భవన సముదాయం తదితర ప్రాంతాల్లో హాత్ సే హాత్ జోడో అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభియాన్ అసెంబ్లీ సమన్వయ కమిటీ సభ్యులు మలపురెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో నానాటికీ నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వ విధానాలపై ప్రజలను హాత్ సే హాత్ జోడో ద్వారా చైతన్య పరచడం జరుగుతుందని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భానుమూర్తి యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈ పాదయాత్ర చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తెర శ్రీధర్, ఆర్ఆర్ నాయుడు, సూరిశెట్టి ఆదిబాబు, మాడిపు నాయుడు, ఆవాల రామారావు, వాయిబోయిన రాజు, బి బాలమురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ శిరీషరాణి

## నూరు శాతం ఇంటి పన్నుల వసూలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈ నెలాఖరు నాటికి జిల్లాలో నూరు శాతం ఇంటి పన్నుల వసూలు జరగాలని పంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, డంపింగ్ యార్డ్‌లను ఆధునీకీకరిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఎంపిక చేసిన కొన్ని గ్రామాలను ఏప్రిల్ 30వ తేదీలోగా అందంగా తయారు చేసేందుకు ఆయా గ్రామాల్లో ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కె.కోటపాడు మండలంలో 32 పంచాయతీలకుగాను 12 గ్రామాలను సుందర గ్రామాలుగా ఎంపిక చేశామని చెప్పారు. అనంతరం మేడిచర్ల, కె.కోటపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులను, మంచినీటి కోనేరు ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఆమె వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో

## అక్రమ నిర్మాణాలు చేపడితే విఆర్ఒలదే బాధ్యత

### జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి


రైతులతో మాట్లాడుతున్న జెసి కల్పనాకుమారి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరిగితే అందుకు వీఆర్వోలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహశీల్దారు గంగాధర్‌రావు సమక్షంలో ఆక్రమణలపై వీఆర్వోలను తీవ్రంగా హెచ్చరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో వీఆర్వో, గ్రామ కార్యదర్శి ధ్రువీకరణ పత్రాలతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. స్పందన కార్యక్రమాల్లో అనకాపల్లి మండలం నుంచి ప్రధాన ఫిర్యాదులు భూకబ్జాలు, ఆక్రమణలపైనే వస్తున్నాయని, ఆక్రమణదారులు ఎంతటి పెద్దవారైనా, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించి హెచ్చరికల బోర్డులు పెట్టాలన్నారు. ఆక్రమణదారులు కోర్టుకు వెళ్లిన స్థలాలను మాత్రం ఆదేశాలు వచ్చేంతవరకు యథావిధిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆక్రమణదారులపై సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్ బి ఫారం పట్టాదారులు ఎల్పిఒల కోసం తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, విశాఖ కలెక్టరేట్ నుంచే దీనిని పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రైతులు సమస్యలను తమ గ్రామాల్లో ఉన్న సచివాలయాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. సమావేశంలో డిటి శ్రీరామ్మూర్తి, రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

## అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని పాటిపల్లి, మంగళవరప్పేట అంగన్వాడీ కేంద్రాలను ఎంపీడీవో రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను, పిపి-1, పిపి-2 రిజిస్టర్లతో పాటు గర్భిణులు, బాలింతల పోషకాహార రిజిస్టర్ల తనిఖీ చేశారు. స్టాక్ అందుబాటులో ఉండటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీలో సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి బుజ్జి ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ప్రోత్సాహం, రాపేటి రామ కొండలరావు మాస్టారు సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు ప్రారంభించారు. 200 మంది గిరిజనులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోడెల జగన్నాధం దొర, పోడెల చిన్నబ్బాయి, కిమిడి అర్జునరావు, సలుగు వరహాల నాయుడు, గుల్లి శ్రీరామ దొర, తేడా చిన్న, పైల యువసేన మండల అధ్యక్షులు గ్రట్రెడ్డి కొండలరావు, వారాధి అప్పారావు, పోడెల జనార్దన్ దొర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు

# వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ తనూజ రెడ్డి, చిత్రంలో మహిళా అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ తనూజ రెడ్డి అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ వినియోగదారులేనని, తమ హక్కులకు భంగం కలిగినప్పుడు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో కొన్న వస్తువులకు కూడా ఈ చట్టం వర్తిస్తుందన్నారు. ప్రతి కొనుగోలుకు బిల్లు విధిగా తీసుకోవాలని, గ్యారంటీ, వారంటీ, ఎక్స్‌పైర్ తేదీ చూసి కొనుగోలు చేయాలని సూచించారు. 50 లక్షల ఖరీదు వరకు ఉన్న వస్తువులపై హక్కులు వర్తిస్తాయన్నారు. వస్తువు నాణ్యతలో లోపాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ వినియోగదారులు రాష్ట్రస్థాయిలో ఫిర్యాదు చేసేందుకు 1915, జాతీయ స్థాయిలో ఫిర్యాదు చేసేందుకు 1967 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. ఇన్‌ఛార్జి డిఎస్‌ఒ కళ్యాణి, ఔషధ నియంత్రణ ఏడి అభిప్రియ, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, అడిషనల్ డిఎంహెచ్ఒ శారద బాయి వినియోగదారుల హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఒ నందకిషోర్, డీటీలు అప్పలనాయుడు, లీల, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు జగప్పారావు, కే జగన్నాథరావు, చౌక డిపోల డీలర్ల సంఘం అధ్యక్షులు శేషుబాబు, జిల్లా వినియోగదారుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఆక్రమణలో ఉన్న దేవుని మాన్యాన్ని వెంటనే స్వాధీనం చేసుకోవాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న**

**- 22 ఎ1(సి)లో నమోదు చేయాలని డిమాండ్**

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి మండలం, మారేపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 115లో దురాక్రమణకు గురైన కోట్లాది రూపాయలు విలువ చేసే 23.15 ఎకరాల దేవుని మాన్యం భూమిని రెవెన్యూ రికార్డుల్లో 22 ఎ1 (సి)లో నమోదు చేసి, ఆ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ భూమిని పూర్వం శిస్తులకు దున్నుకున్న వ్యక్తులు దీనిపై హక్కులు కల్పించాలని 1999లో విశాఖపట్నం మున్సిపల్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించగా, అది చెల్లుబాటు కాదని, వారి పిటిషన్‌ను కోర్టు కొట్టువేసిందని తెలిపారు. ఇనేళ్లపాటు కనుమరుగైన ఈ జడ్జిమెంట్ కాపీ బయటపడిందని పేర్కొన్నారు. 10(1) రికార్డుల్లోనూ, సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్‌లోనూ దేవుని భూమిగా వుందని, కాని ఆక్రమణదారులు రికార్డుల్లో వారి పేర్లును చేర్చుకొని భూమిని తమ స్వాధీనంలో ఉంచుకున్నారని వెల్లడించారు. ఈ జడ్జిమెంట్ కాపీని దేవాదాయశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు ఇస్తూ మారేపల్లి శ్రీరాములు వారి దేవస్థానం పేరున పాస్ బుక్కు ఇవ్వాలని దరఖాస్తు పెట్టారని తెలిపారు. రెవెన్యూ అధికారులు తాత్సారం చేయకుండా శ్రీరాములు వారి దేవస్థానం పేరున పాస్ బుక్కులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## స్కీం వర్కర్లకు బడ్జెట్ కేటాయించాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి** :ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో స్కీం వర్కర్లకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఎఐటియుసి జిల్లా నాయకులు కోన లక్ష్మణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు నిబంధనల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో ఈనెల 17న స్కీం వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సన్యాసిదేముడు కుటుంబానికి ఎమ్మెల్యే ఓదార్పు

**ప్రజాశక్తి అచ్యుతాపురం** : మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్ పెంటకోట సన్యాసి దేముడు హరిపాలెం గ్రామంలో ఇటీవల మతి చెందిన నేపథ్యంలో బుధవారం సంతాప దినం గ్రామంలోని ఆయన ఇంటి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసిదేముడు చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబురాజు సన్యాసిదేముడు కుటుం సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

## హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-అచ్యుతాపురం** : మండలంలోని గండివాని పాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని రీజనల్ మేనేజర్ పి నాగప్పారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ అన్నింటి కంటే సేకరించిన పాలకు అధిక ధర చెల్లిస్తుందని చెప్పారు. డెయిరీ మేనేజర్ కె.శేషు మాట్లాడుతూ పాల రైతులకు, పాడి పశువులకు బీమా సదుపాయం హెరిటేజ్ డెయిరీ కల్పిస్తుందన్నారు. పశువులకు వైద్య సేవలు అందించడంలో డెయిరీ ముందంజలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.వెంకట్రావు, ఎన్ అప్పారావు, రమణమ్మ, దేవుడు పాల్గొన్నారు.

## వికలాంగుల విద్యకు అధిక ప్రాధాన్యత

**ప్రజాశక్తి-అనకాపల్లి** : ప్రత్యేక అవసరాలు గల వికలాంగులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఉపకరణాల పంపిణీ నిమిత్తం ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు శిబిరం స్థానిక ఉడ్డుపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా డిఇఒ మాట్లాడుతూ ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల మాట్లాడుతూ వికలాంగులకు అందించే ఉపకరణాలు వారి సమాజ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దివాకర్, జిసిడిఓ వెంకటలక్ష్మి, సత్య ప్రసాద్, ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు, మహాలక్ష్మి నాయుడు, దేముడు బాబు, వర ప్రసాద్, ఐఈఆర్‌పిలు, ఎన్టీఆర్ ఆసుపత్రి సిబ్బంది, వివిధ మండలాలకు చెందిన 127 మంది వికలాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**డైమండ్ హిట్స్ సౌజన్యంతో**

# 20 నుంచి రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

డైమండ్ హిట్స్ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సౌజన్యంతో, జ్యోతి సరళ కళాపరిషత్ ఆధ్వర్యంలో, ఎంహెచ్ స్కూల్ 1975 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సహకారంతో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. స్థానిక వివి రమణ రైతు భారతి ఆడిటోరియంలో బుధవారం నాటిక పోటీల గోడ పత్రిక, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకొని ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**నాటిక పోటీల వివరాలు**

ఈ నెల 20న సాయంత్రం 6.30 గంటలకు విజయవాడ హర్ష క్రియేషన్స్ వారి 'స్వర్ణ కమలాలు', రాత్రి 8 గంటలకు చిలకలూరిపేట అంజన రాథోడ్ థియేటర్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా', 21న సాయంత్రం 6.30 గంటలకు విశాఖపట్నం నటరాజ్ ఆర్ట్ క్రియేషన్స్ వారి 'ది లాస్ట్ జడ్జిమెంట్', 8 గంటలకు హైదరాబాద్ భూమిక థియేటర్స్ గ్రూప్ వారి 'బరిబత్తుల రాజు', 9 గంటలకు విశాఖపట్నం ఎస్‌జెఎస్ స్మారక కళాపరిషత్ వారి 'తపన', 21న సాయంత్రం 6.30 గంటలకు సర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారిచే 'కొత్త పరిమళం', రాత్రి 8 గంటలకు కొప్పోలు పండు క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు' తదితర నాటికలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.

అనంతరం ప్రముఖ సీనియర్ నటులు, నిర్మాత దర్శకులు పిళ్లా సన్యాసిరావుకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శనకు రూ.5వేలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.3వేలు, తృతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.2వేలు నగదు బహుమతులు ఉంటాయని చెప్పారు. ఈ పోటీలకు అందరూ ఆహ్వానితులేనన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సిహెచ్ నాయుడు, బి.జగత్రావు, కేఎం నాయుడు, నండూరి ప్రభాకర్ రావు, జిఎన్ మూర్తి, రాపేటి నారాయణరావు, మల్ల లోకేశ్వరరావు, భీశెట్టి కృష్ణ అప్పారావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

# పిచ్చికుక్క స్వైర విహారం

## 15 మందికి పైగా గాయాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని బుచ్చయ్యపేట, దిబ్బిడి గ్రామాలలో బుధవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం వరకు రెండు గ్రామాల్లో కలియతిరిగి కనిపించిన వారిని కనిపించినట్లు కరిచింది. పిచ్చికుక్క దాడిలో 15 మందికి పైగా గాయపడ్డారు. దిబ్బిడి గ్రామానికి చెందిన పెదిరెడ్ల హేమంత్, కందికొండ సత్యవమ్మ, గొన్నాబత్తుల సూరిదేముడు, గొంప మాలిబాబు, బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన గాడి కొండమ్మ, నేమాల సురేష్, శనివాడ రవితేజ, నెమలి అప్పారావు, ధనం రెడ్డి గంగ తల్లి, అయితరెడ్డి రవి, తూరిబిల్లి లక్ష్మి, సూరిశెట్టి హర్ష, తోట అచ్చమ్మ, గాడి చిన్నమ్మలు తదితరులు గాయపడ్డారు. వీరికి బుచ్చయ్యపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్సలు అందజేశారు. వీరిలో తీవ్రంగా గాయపడిన గొంప మాలి బాబు, గొన్నాబత్తుల సూర్య దేవుడు, ధనం రెడ్డి గంగ తల్లి, పెద్దిరెడ్డి హేమంత్, అయితరెడ్డి రేవతి తదితరులను చోడవరం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

# సత్యనారాయణ సేవలు మరువరానివి

**ప్రజాశక్తి- కె.కోటపాడు** : పాడి రైతులకు సుందరపు సత్యనారాయణ చేసిన సేవలు మరువరానివని చౌడువాడ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, వైసిపి నాయకులు దాట్ల శివాజీరాజు అన్నారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ నివాసం వద్ద ఆయన తండ్రి సుందరపు సత్యనారాయణ 11వ వర్థంతి కార్యక్రమం బుధవారం జరిగింది. ముందుగా సత్యనారాయణ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సత్యనారాయణ విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో పాడి రైతులకు డెయిరీ అందించిన సంక్షేమ కార్యక్రమాలు, రైతుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు, విద్యను కల్పించేందుకు విశేషంగా కృషి చేశారని చెప్పారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే 120 మంది విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఏటికూరి రాజేష్, పాల సొసైటీ అధ్యక్షులు కుమార్ వెంకటరమణ, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు రాజి మోది నాయుడు, పాల సొసైటీ మాజీ ప్రెసిడెంట్ కుమార ఎర్రినాయుడు, వార్డు మెంబరు తనకల పట్టాలు, రాజి అప్పలనాయుడు, బల్క్ కూలింగ్ సెంటర్ సూపర్వైజర్లు, పాల సొసైటీ సిబ్బంది 1పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి** : మహిళా ఉద్యోగులు తమ ఇంటి బాధ్యతలతో పాటు, కార్యాలయ విధులు నిర్వహించాల్సిన నేపథ్యంలో తమ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు కె.లావణ్య అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సహకార శాఖ సిబ్బంది, దిశా పోలీస్ స్టేషన్ మహిళా సిబ్బందికి ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట బయట తీవ్ర ఒత్తిడికి గురవుతున్న మహిళా ఉద్యోగులు పలు ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై తగిన శ్రద్ధ వహించి ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా అనారోగ్యం బారి నుంచి బయట పడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి పిఎల్ఎన్ కిరణ కుమారి, దిశ స్టేషన్ సీఐ లక్ష్మి, ఎస్సై రాములమ్మ, డాక్టర్ శ్రీబాల, సిబ్బంది పాల్గొన్నారు.

## కాన్షీరామ్ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి - కశింకోట** : బిఎస్‌పి వ్యవస్థాపకులు కాన్షీరామ్ 89వ జయంతి వేడుకలు కసింకోట ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్సీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సేవాస్తంబు రాష్ట్ర అధ్యక్షులు కె.మోహన్ రాజు మాట్లాడుతూ అంబేద్కర్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కాన్సీరామ్ సైకిల్‌పై ఉత్తరప్రదేశ్ రాష్ట్రమంతా తిరిగి ప్రజలను చైతన్యవంతులు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పావాడ సన్యాసిరావు, వంకర వెంకట్రావు, తట్టా కృష్ణ, చెవిటి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వెంకన్నపాలెంలో పర్యటిస్తున్న ఎంపిడిఒ శ్యామ్ సుందర్

## వెంకన్నపాలెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని వెంకన్నపాలెం సచివాలయ పరిధిలో ఎంపీడీవో ఎస్జి శ్యామ సుందర్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలనూ శానిటరీ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో జ్వరాలు, జలుబు వంటివి ఉన్నాయని, దోమలు లేకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారులతో పాటు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఎన్జీవో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా కాళ్ళ

ప్రజాశక్తి- అనకాపల్లి



కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా పార్టీ మండల అధ్యక్షులు కాళ్ల వెంకట సత్యనారాయణను నియమించారు. ఈ అవకాశం కల్పించిన ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి పోచరెడ్డి రాకేష్ రెడ్డికు బుధవారం ఒక ప్రకటనలో సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కశింకోట

స్థానిక బన్నీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కసింకోట హైస్కూల్ ఎదురుగా చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ బన్నీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెంటకోట రాము, వేగి గోపికృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు, కాండ్రేగుల సతీష్, మళ్ళ లోవ కృష్ణ, ఆడారి నరసింహారావు, తాకాసి కృష్ణ, పెంటకోట తాతిబాబు, మళ్ల మహాలక్ష్మి నాయడు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
గురువారం 16 మార్చి 2023
7

# సాగులో ఉన్నా..రికార్డుల నుంచి తొలగింపు

## - ఆందోళనలో చటర్జీపురం ఆదివాసీలు - పట్టని అధికారులు, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రోలుగుంట:అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఎంకె.పట్నం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 139లోని పదెకరాల భూమిలో చటర్జీపురంకు చెందిన గదబ ఆదివాసీలకు చెందిన నాలుగు కుటుంబాలు తరతరాలుగా సాగులో ఉన్నాయి. కేదారి రాజుబాబు అనే కుటుంబం కూడా అదే భూమిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంది. గిరిజనులు మెట్ట పంటలను పండిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. గతంలో వీరిచ్చిన వినతిపత్రాలపై స్పందించిన రోలుగుంట రెవెన్యూ అధికారులు వారి సాగు అనుభవాన్ని తనిఖీ చేసి సాగుబడి రిజిస్టర్‌లో వారి వారి పేర్లను కూడా నమోదు చేశారు. వారికి సాగు బడి రిజిస్టర్ సర్టిఫికెట్ కాపీలు కూడా ఇచ్చారు. అయితే తమ సాగులో ఉన్న భూమిని కాకినాడ జిల్లా బిక్కవోలు మండలానికి చెందిన ఒక వ్యక్తి పేరుతో మార్పే యబోతున్నారని తెలుసుకొని ఆదివాసీలు స్థానిక అధికారులకు గతంలోనే విజ్ఞప్తి చేశారు. నర్సీపట్నం న్యాయస్థానంలో కూడా ఆ గిరిజనేతరుడిపై దావా వేసుకున్నారు. తాము దాఖలు చేసిన కేసు వివరాలను రోలుగుంట రెవెన్యూ అధికారులకు కూడా అందజేశారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్ని బాధితులు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

సాగులో ఉన్న వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, తమ వాదనలూ వినకుండా రికార్డుల్లో మార్పు చేయడం చట్టపరంగా చెల్లదు. కానీ గత ఏడాది నవంబర్‌లో తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు ఆయా రికార్డులు మార్పు చేయడంతో పాటు సాగుబడి రిజిస్టర్‌లో అప్పటికే నమోదైన తమ పేర్లను తొలగించేశారని బాధితులు ఆరోపించారు. ఈ సందర్భంగా నీలాపు నూకాలమ్మ మాట్లాడుతూ తమకు ఈ భూమి తప్పా వేరే జీవనాధారం లేదని, భూమిని, వ్యవసాయాన్ని నమ్ముకొని తాతల నుంచి నుండి ఇక్కడే జీవిస్తున్నామని, అధికారులు తమకు అన్యాయం చేస్తున్నారని గగ్గోలు పెట్టింది. ఇంకో రైతు నీలాపు అప్పలనాయుడు మాట్లాడుతూ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు తమ విజ్ఞప్తులపై స్పందించి భూముల్ని పరిశీలించారని, అయినప్పటికీ అవతలి వర్గం ఇచ్చిన లంచాలకు కక్కుర్తి పడి తమ పేర్లను తొలగించారని ఆరోపించారు.



పట్టాలు చూపుతున్న గిరిజనులు

ఈ విషయమై అఖిలభారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం మండల కన్వీనర్ మోసూరి రాజు మాట్లాడుతూ నాన్ షెడ్యూల్డ్ ఏరియా ఆదివాసీలకు అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత చాలా అన్యాయం జరుగుతోందని వాపోయారు. చీడికాడ నుంచి నాతవరం ప్రాంతంలోని మండలాల్లో ఆదివాసీల సాగులో ఉన్న భూముల్ని ఏకపక్షంగా రికార్డులు మార్చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం కనిపించడం లేదన్నారు. ఆ సంఘం జాతీయ ప్రతినిధి పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ చటర్జీపురం ఆదివాసీలకు జరిగిన అన్యాయంపై తాము గతంలోనే నర్సీపట్నం ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చామన్నారు. తొలగించిన ఆదివాసీ సాగుదారుల పేర్లను రికార్డుల్లో పునరుద్ధరించాలని కోరామని, అయినప్పటికీ చర్యలు మాత్రం శూన్యమన్నారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరిధిలోని రోలుగుంట మండలం ఉందని, గొలుగొండ మండలంలో అప్రతిష్టపాలైన తహశీల్దార్ వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే స్వయంగా రోలుగుంట మండలానికి రప్పించారని ఆరోపించారు. ఆదివాసీలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంటుందని కనీసం ఆర్డీవో స్థానిక అధికారుల సమక్షంలో సమీక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 18న రోలుగుంట తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి అక్కడి వారు సంఘీభావం తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



పందిరి రాట వేస్తున్న గ్రామ పెద్దలు

### ఉపమాకలో ఘనంగా పందిరి రాట

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక మెరకవీధి రామాలయం వద్ద బుధవారం ఉదయం గ్రామ పెద్దలు ఈనెల 30న శ్రీరామనవమి వేడుక సందర్భంగా పందిరి రాట వేశారు. ఈ నెల 30న జరిగే శ్రీరామనవమి వేడుక సందర్భంగా 23 గురువారం ఉదయం 6 గంటల నుండి 30 వ తేదీ గురువారం ఉదయం 6 గంటల వరకు గ్రామ ప్రజల సహకారంతో, శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో సప్తాహం ( 7 రోజులపాటు భజన కార్యక్రమం ) నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 30న సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సిద్దబత్తుల కృష్ణ, కొప్పిశెట్టి రమణ, చెరుకూరి వెంకటేశ్వరరావు, గరగ సూర్యనారాయణ, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, గోర్స శ్రీనివాస్, జోగేశ్వరరావు, తోలేటి శ్రీనివాస్, బద్ది హరిబాబు, తోట అప్పారావు, నాగేశ్వరరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

### దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి -కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోటలో బుధవారం దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. తొలి రోజు ఒకటి నుంచి మూడు వార్డులలో మురుగు నీటి కాలువలు శుభ్రం చేసి మందును పిచికారీ చేశారు.గ్రామంలో గత కొంత కాలంగా దోమల బెడద ఎక్కువగా ఉంది. దీనిపై పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవ, వార్డు సభ్యులు, ఈఓ కృష్ణ మోహన్‌తో సంప్రదించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని తీర్మానించారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

### బీమా సౌకర్యం కల్పనకు కృషి

#### వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు రామారావు

ప్రజాశక్తి - కోటవురట్ల:జీడి, మామిడి సహా హార్టికల్చర్ పంటలకు బీమా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లావ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, ఉత్తరాంధ్ర జోనల్ ఇన్చార్జి చిక్కాల రామారావు అన్నారు. ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ మండలి చైర్మన్‌గా చిక్కాల రామారావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా పైల రమేష్‌ను నియమించింది. బుధవారం జెడ్పిటిసి సభ్యురాలు స్వగృహం వద్ద చామంతుల శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన సమావేశంలో వీరిని మండల వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ, ప్రధానంగా రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. బీసీ సెల్ అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ, జిల్లా స్థాయి పదవి దక్కేందుకు కృషి చేసిన చిక్కాల రామారావుకు జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు సిద్ధబత్తుల సత్యనారాయణ, మాజీ జడ్పిటిసి సభ్యురాలు వంతెర వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ నూకరత్నం, చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ, కొడవటిపూడి మాజీ సర్పంచ్ సత్యనారాయణ, అన్నవరం వైసిపి సీనియర్ నాయకులు బాబ్జి, సహా పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట గ్రామంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నూకాలమ్మ దేవాలయంలో బుధవారం నూకాలమ్మ పోతురాజుబాబుల విగ్రహం ప్రతిష్టను ట్రస్ట్ చైర్మన్ బొండల నూకరత్నం, ఆలయ పూజారి గోలకొండ త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గొలుగొండకు చెందిన కీర్తిశేషులు కుంత్యం సత్యనారాయణ కుటుంబీకులు నూకాలమ్మ పోతురాజుబాబు విగ్రహాలకు 3 లక్షల విలువైన రెండు వెండి కిరీటాలను బహూకరించారు. లింగంపేట గ్రామానికి చెందిన అంబటి ప్రసాద్ అరతులం బంగారం అమ్మవారికి బహూకరించారు.సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొండల రాజు, మండల వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ(బాబ్జి), స్థానిక సర్పంచ్ సంతోష్ కుమార్, ట్రస్ట్ మాజీ చైర్మన్ గోలకొండ లింగయ్య, ఎంపిటిసి మహాలక్ష్మి పాల్గొన్నారు.

### నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని బయ్యపురెడ్డిపాలెంలో సీతారామ చంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 16వ తేదీ గురువారం నుండి 18వరకు మూడు రోజులు పాటు దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు స్థానిక విలేకరులకు తెలిపారు. మొదటి రోజు హరినామ సంకీర్తన, శుక్రవారం సాయంత్రం జాతీయ పురస్కార గ్రహీత ఎన్‌డిసిపి పానంగిపల్లి రంగనాథ చార్యులు సుదర్శనం సీతారామాచార్యులతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కళ్యాణం, శనివారం మధ్యాహ్నం అన్న సమారాధన, స్వామి పల్లకి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

### డ్రెయినేజీలో చెత్తాచెదారం

ప్రజాశక్తి-మాకవరపాలెం: బీమబోయినపాలెం నుంచి చింతలూరుకి వెళ్లే రహదారి పక్కన ఉన్న మురుగు నీటి కాలువ చెత్తా చెదారంతో నిండి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు తెలిపారు. కాలువ పూర్తిగా చెత్తతో నిండిపోవడంతో దోమలకు నిలయంగా మారిందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. కాలువులో చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు.



పేరుకుపోయిన చెత్తా చెదారం

### 18న వాహనాల వేలంపాట

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక ఎస్ఇబి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో 3 వాహనాలకు వేలంపాట నిర్వహించ నున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18న నర్సీపట్నం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కల వారు పోలీస్ స్టేషన్లో ముందుగా రూ.2వేలు చెల్లించి టోకెన్ తీసుకోవాలని సూచించారు.

### హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి -కొత్తకోట:ఆస్తి తగాదాల నేపథ్యంలో సొంత తమ్ముడినే ట్రాక్టర్తో తొక్కించి హత్య చేయాలని చూసిన అన్నను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించి నట్లు రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన కథనం మేరకు... మేడివాడ శివారు అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన మడకా రమణ, ఆతని తమ్ముడు మడకా సింహాద్రినాయుడులు కొంత కాలంగా ఆస్తితగాదాలు పడుతున్నారన్నారు. తరచూ వివాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 13న బైక్ పై వెళ్తున్న తమ్ముడు సింహాద్రినాయుడును ట్రాక్టర్తో తొక్కించి హత్య చేయాలని తలచి ట్రాక్టర్‌తో బలంగా ఢీ కొట్టడన్నారు. ఈ ప్రమాదంలో సింహాద్రి నాయుడు తీవ్రగాయాలతో బయటపడ్డాడన్నారు. బాదితుని పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం రమణను బుధవారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు.

### రక్తహీనతపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-గొలుగొండ:అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల్లో రక్తహీనతపై కార్యకర్తలు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ డేవిడ్ రాజు సూచించారు. మండలంలో గుండుపాల కొత్తూరు అంగన్వాడి కేంద్రాన్ని, ఎంపీపీ పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. అంగన్వాడి కేంద్రంలో ఆయన రికార్డులను, స్టాకును పరిశీలించారు. గర్భిణి, బాలింతలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అనంతరం చిన్నారుల ప్రీస్కూల్ యాక్టివిటీని తిలకించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలను సందర్శించి పిల్లల విద్యా స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలవుతుందో లేదో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సత్యవతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ



మాట్లాడుతున్న ఎంపిడిఒ

### ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎక్కువ మంది కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో చేపడుతున్న ఉపాధి పనులపై సమీక్షించారు. కూలీల బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ అనుసంధానం చేయించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో ఈశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆ విద్యార్థిని భవితవ్యం ఏంటి ?'

### హాజరు తక్కువపై సమాచారం ఇవ్వని కాలేజీ సిబ్బంది

### ఇంటర్ పరీక్ష రాయలేకపోయిన విద్యార్థిని

**ప్రజాశక్తి- గొలుగొండ:**ఎఎల్ పురం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సిఇసి చదువుతున్న ఎల్.దుర్గ హాజరు తక్కువ కావడం, ఇందుకు సంబంధించి సిబ్బంది సకాలంలో చెప్పక పోవడంతో ఆ విద్యార్థిని బుధవారం జరిగిన పరీక్షలను రాయలేక పోయింది. బాధితురాలి తల్లి స్థానిక విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల ముందు హాల్ టికెట్ కోసం కళాశాలకు తన తమ్ముడు వెళ్ళాడని, విద్యార్థినికి కొంతమేర హాజరు తక్కువగా ఉందని దానికి సంబంధించి ప్రభుత్వానికి కట్టాల్సిన రుసుము కోసం కళాశాలకు సమాచారం రావాల్సి ఉందని కాలేజి సిబ్బంది చెప్పారన్నారు. సమాచారం అందిన వెంటనే విద్యార్థినికి తెలియజేస్తామని సిబ్బంది చెప్పారని ఆమె అన్నారు. ఆ తర్వాత తమకు ఎటువంటి సమాచారాన్ని అందించలేదని ఆమె తెలిపారు. ప్రభుత్వానికి రుసుము చెల్లించాలని కళాశాల సిబ్బంది తమకు ఆలస్యంగా తెలియజేశారని, దీంతో చెల్లించలేకపోయానన్నారు. బుధవారం చెల్లిస్తానని తమ కుమార్తెను పరీక్షలకు అనుమతించమని కోరినప్పటికి హాల్ టికెట్ ఇవ్వకుండా నిరాకరించి పరీక్షలకు అనుమతించలేదని ఆమె విలేకరులకు తెలిపింది. తమకు ఆన్లైన్లో హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలనే విషయం తెలియదని, ఈ విషయంపై కళాశాల వద్ద కొంతమందికి తెలియజేశామని పేర్కొంది. ఆన్లైన్లో హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రానికి వెళ్ళమని సూచించారని, వెంటనే స్థానికంగా ఉన్న కంప్యూటర్ సెంటర్ కి వెళ్లి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని కాలేజీకి వెళ్లే సరికి సమయం మించిపోయిందని సిబ్బంది తమ కుమార్తెను పరీక్షలకు అనుమతించలేదని అని తెలిపింది.

ఈ విషయాన్ని తెలుసుకున్న కళాశాల అధ్యాపకులు ఇద్దరు సాయంత్రం 6 గంటల సమయంలో ఆమె స్వగ్రామం అమ్మపేట గ్రామంలో ఆమె ఇంటికి వెళ్లారు. శుక్రవారం రెండో పరీక్షకు హాజరుకావాలని ఆమెకు తెలిపారు. తెల్ల కాగితం మీద సంతకం పెట్టమని విద్యార్థిని తల్లిని కోరగా ఆమె నిరాకరించడంతో అక్కడనుండి అధ్యాపకులు వెళ్ళి పోయారు.

## ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

**ప్రజాశక్తి -రావికమతం:**మండలంలో కవగుంట పంచాయతీ బుడ్డిబంధ గ్రామంలో పట్టాలమ్మ తల్లి తీర్థం సందర్భంగా మంగళవారం రాత్రి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలలో 12 గ్రామాలకు చెందిన వాలీబాల్ టీములు పాల్గొన్నాయి. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అందజేశారు. ప్రథమ బహుమతి గుమ్మళ్ళలపాడు, ద్వితీయ ఒంద్రు వీధి, తతీయ చినపాచిల గ్రామాలు దక్కించుకున్నాయి. మహిళలతో కోలాటం, అన్న సమారాధన ఏర్పాటు చేశారు.



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

## గ్రావెల్ ట్రాక్టర్ సీజ్

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలోని ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. పెదతీనార్ల పంచాయతీ దొండవాక సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ను బుధవారం పట్టుకున్నట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్కు అప్పగిచామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్, ఇసుక తరలిస్తే కేసులు తప్పవని ఎస్ఐ శిరీష హెచ్చరించారు .



సీజ్ చేసిన ట్రాక్టర్

# సజావుగా ఇంటర్ పరీక్షలు

## - ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి నిరాకణ

**ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్ష కేంద్రంలోరనికి అనుమతించ లేదు.**

**ప్రజాశక్తి-యంత్రాంగం:**

**దేవరాపల్లి**:దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు జనరల్ విద్యార్థులు 201 మంది, ఒకేషనల్ 77 మంది, మొత్తం 278 మంది విద్యార్థులకు గాను 259 మంది హాజరుకాగా, 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్, కళాశాల ప్రిన్సిపాల్ యువిఎన్.వర్మ తెలిపారు. 15 గదుల్లో సీసీ కెమెరాల మధ్య పరీక్షలు జరిగాయి. పెందుర్తి నుంచి మతిస్థిమితం లేని (ఇన్నోసెంట్) షేక్ సుభాష్ అనే విద్యార్థి తల్లి సహాయంతో పరీక్ష రాయడానికి హాజరయ్యాడు. డిపార్ట్మెంట్ ఆఫీసర్గా కె.శ్రీనివాసరావు వ్యవహరించారు. ఎస్సై డి నాగేంద్ర ఆధ్వర్యాన గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కొత్తకోటలో..

**అచ్యుతాపురం :** స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 28 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. ఇక్కడ పరీక్ష కేంద్రంలో 314 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 286 మంది హాజరయ్యారు. గేటు వేసిన అనంతరం ఒక విద్యార్థి రాగా, పరీక్షల నిర్వహణ అధికారి ఆ విద్యార్థిని లోపలకు అనుమతించకపోవడంతో పరీక్ష రాకుండానే వెనుదిరిగారు. పరీక్ష కేంద్రం వద్ద సిఐ వై మురళి రావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రవి పఠాన్శెట్టి ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

**పరవాడ :** మండల కేంద్రంలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి బుధవారం సందర్శించారు. మౌలిక వసతుల కల్పనపై ప్రిన్సిపాల్ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటితో సహా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**కశింకోట :** మండలంలోని తాళ్ళపాలెం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో 372 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 13 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పి విజయ్భాస్కర్ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ళ మాణిక్యం ఉన్నారు.

**కొత్తకోట:**కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ కళాశాలలో సుమారు 323 మంది మొదటి, రెండవ ఏడాది పరీక్షలకు హాజరు కానున్నారు. బుధవారం మొదటి ఏడాది పరీక్షకు సుమారు 219 హాజరు కావాల్సి ఉండగా జనరల్ సబ్జెక్ట్ లలో ముగ్గురు, ఒకేషనల్ సబ్జెక్ట్లలో మరో ముగ్గురు గైర్హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సాయికుమార్ తెలిపారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకు హల్ టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

**నక్కపల్లి:** ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.నక్కపల్లిలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక రెసిడెన్షియల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాశారు.పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోలాహలం కనిపించింది.

**కేంద్రాలను డిఎస్పి తనిఖీ**

**నర్సీపట్నంటౌన్:** మున్సిపాలిటీ పరిధిలో ఏడు పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాయడానికి అనుమతి లేదన్న నిబంధనలతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకున్నారు. నర్సీపట్నంలో ప్రశాంతంగా ఇంటర్మీడి యట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు పగడ్బందీ ఏర్పాట్లు చేశారు. నర్సీపట్నం డిఎస్పి కె.ప్రవీణ్ కుమార్ రూరల్ సిఐ రమణయ్య, పట్టణ ఎస్సై గోవిందరావుతో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, తాగునీరు తదితర సౌకర్యాలను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద మాల్ ప్రాక్టీస్, కాంపౌండ్ లోపలకు బయట వ్యక్తుల చొరబాడకుండా పోలీసు సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల వద్ద తగినంత బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



దేవరాపల్లిలో..

**గొలుగొండ:**మండలంలో ఏఎల్ పురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని నాలుగు కళాశాలల నుండి 250 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ఎనిమిది మంది పరీక్షలకు హాజరు కాలేదు. ఇందులో ఇద్దరు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావ డంతో పరీక్షలు రాయడానికి అనుమతి ఇవ్వలేదు. గొలుగొండ ఎస్సై నారాయణరావు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.




నక్కపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

**భీమునిపట్నం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులు 636 మందికి గాను 614 మంది తొలి రోజు పరీక్ష (తెలుగు, సంస్కృతం, జిఎఫ్సి) రాశారు. 22 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష రాసేందుకు కేటాయించిన ప్రతి గదిలో కూడా సిసి కెమెరాలు ఏర్పాటుచేసినట్లు కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపల్, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కె.సూరిబాబు తెలిపారు. ఈ కళాశాలతో పాటు భీమిలి, దొరతోట, మూలకుద్దు, సంగివలస, తగరపువలస, తాళ్ళవలస, ఆనందపురం మండలం బోయిపాలెం ప్రాంతాల్లో ఉన్న మరో 9 ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోనూ ఇంటర్ పరీక్షలు జరిగాయి.

## పరీక్షా కేంద్రాల్లో పరిశీలన

**సీతమ్మధార :** ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ఉదయం ప్రారంభానికి మునుపు సీతమ్మపేటలో ఏర్పాటుచేసిన వివిధ పరీక్ష కేంద్రాల్లో వసతులను ఆర్ఐఒతో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం పరిశీలించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, వైద్య సేవలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం అప్పారావు, సీతారాం మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి విద్యార్థులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీని వల్ల విద్యార్థులు పరీక్షలు రాసే అవకాశం కోల్పోయే ప్రమాదముందని, ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని పోలీస్, రవాణా శాఖ అధికారులుకు కమిషన్ ఆదేశాలు జారీచేస్తోందని చెప్పారు. అనుమతి లేనిదే ఇతరులను పరీక్షా కేంద్రాల లోపలకు అనుమతించొద్దన్నారు. విద్యార్థుల నుంచి వారి తల్లిదండ్రుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా తక్షణమే ఇంటర్మీడియట్ అధికారులుతో పాటు కమిషన్ తరపున చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ పర్యటనలో ఆర్ఐఒ పి.ఉమారాణి పాల్గొన్నారు.

## సోషల్ ఆడిట్కు సిద్ధం కావాలి

**ప్రజాశక్తి -కోటవురట్ల:**మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జరిగిన పనులకు సోషల్ ఆడిట్కు సిద్ధంగా ఉండాలని ఏపీడి రమణికుమారి బుధవారం సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఉపాధి హామీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, సమగ్ర వివరాలు ఆడిట్ సమయానికి సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ గంగు నాయుడు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కుప్ప దగ్ధం

**ప్రజాశక్తి-యస్.రాయవరం:**విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో వరి కుప్ప దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని చినగుమ్ములూరు గ్రామానికి చెందిన కంటే బాబ్జి వరి కుప్ప బుధవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతయ్యింది. వరి చేను పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్ల నుంచి షార్ట్ సర్క్యూట్తో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని రైతులు తెలిపారు. నక్కపల్లి అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.




దగ్ధమైన వరి కుప్ప

## విత్తనాలు సిద్ధం

**ప్రజాశక్తి-మాకవరపాలెం:** రైతులకు పశుగ్రాసం కోసం గడ్డి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పశు వైద్యాధికారి రామ్మోహనరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలో మాకవరపాలెం, రాచపల్లి, బూరుగుపాలెం పశువైద్య కేంద్రాలకు కాకిజోన్న గడ్డి విత్తనాలు సరఫరా అయ్యాయన్నారు. ఈ విత్తనాలను రైతులకు రాయితీ పై పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలు కావాలసిన రైతులు స్థానిక పశు వైద్య కేంద్రంలో 5 కేజీలకు గాను రూ.120 చెల్లించాలన్నారు.



## పశువులకు గర్భకోశ వైద్య శిబిరం

**ప్రజాశక్తి-రోలుగుంట:**మండలం నిండుగొండలో బుధవారం పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం సర్పంచ్ శెట్టి సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిబిరంలో 21 పశువులకు బుచ్చంపేట, కొత్తకోట పశు వైద్యులు అశ్విని, బాల తేజ గర్భకోశ పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. 160 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు 18 దూడలకు పరాన్న జీవుల మందు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శెట్టి సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి రాజారావు, స్థానిక సచివాలయ అసిస్టెంట్ వల్లిక, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.